అభాగ్యుని అంతిమయాత్ర

చివరి బస్సుకూడా తప్పిపోవటంతో తన దురదృష్టాన్ని నిందించుకోక తప్పలేదు—రామకృష్ణకు.

బయలుదేరిన వేళావిశేషం ఈ విధంగా బెడిసికొట్టడం మనసుకు కష్టంగా తోచినా, చేసేదేమీ లేక వెనుదిరిగి నడవటం మొదలెట్టాడు. అతనికి వెంటనే ఎదురైన సమస్య "ఎక్కడికి వెళ్ళటం"; రేపు వుదయం ఏడింటి వరకూ ఎలా గడపటం?" అనేది.

తనకు తెనాలి కొత్త కాకపోయినా, వెళ్తే అతిథిపూజలుచేసి ఆదరించే మిత్రు లెంతోమంది వున్నా స్వతహాగా ఒకరింటికి వెళ్ళే తత్వం కాదు తనది, అదీగాక ఆ సమయంలో ఎవరో వొకరింటికివెళ్ళి వాళ్ళని యిబ్బంది పెట్టటం ఎందుకులే అనుకుని ఏదోవిధంగా ఆ రాత్రి గడపాలని నిశ్చయించుకున్నాడు.

ఏడున్నర గంటలైంది.

"మరో రెండు గంటలు గడిపితే ఏదైనా సినిమా చూడవచ్చు. సినిమా అయ్యేసరికి ఏ రెండో అవుతుంది. అప్పుడే మారిసుపేట సత్రంలోనో, రైల్వే స్టేషనులోనో కన్ను మూసుకుంటే ఎంతలో తెల్లవారుతుందిలే" అనిపించింది. "ప్రొద్దుటే అయినా మొదటిబస్సు తప్పిపోకుండా జాగ్రత్త పడాలి, లేకుంటే పెందలకడ యిల్లుచేరే యోగం వుండదు"అని తన్నుతాను హెచ్చరించుకున్నాడు అంతలోనే.

ఇలా ఆలోచించుకుంటూ వంతెన మీదకు చేరాడు రామకృష్ణ. అక్కడనుండి మెయిన్ బజారుకు వెళ్ళే రోడ్డొకటి కొత్తవంతెనమీదుగా రామలింగేశ్వరపేట పోయే రోడ్డొకటి వున్నై. ఎటు వెళ్ళటమా అని మనసులో మధనపడుతున్న రామకృష్ణకు ఎదురుగా సినిమా పోష్టరు కనిపించింది. "స్వరాజ్య టాకీస్‌లో ఫలానా సినిమా" ఆ సినిమా బాగున్నదని వుదయం తను ప్రయాణం చేసిన బస్సులో ఎవరో చెప్పుకోవటం తాను విన్నాడు. ఆ బాగేమిటో చూడాలనే కుతూహలం మనసును ఆవరించగా కొత్త వంతెన వైపు నడక సాగించాడు రామకృష్ణ.

ఒకవైపు కృష్ణానది నీటిని పంటచేలకు కొనిపోయే పంటకాల్వ, మరోవైపు సరుకుల రవాణా సౌకర్యాలకు పడవలు నడిచే "పడవల" కాల్వ. మధ్య రోడ్డు. ఆ రోడ్డులో ఫర్లాంగు దూరంలో రెండు వంతెనలు - పాత వంతెన, కొత్తవంతెన. రోడ్డు పొడుగునా మెర్క్యూరీ లైట్లు.

ఇంతవరకు పల్లెపట్టులను, అక్కడి ప్రకృతి సోయగాన్ని వర్ణించి వ్రాయటమే అలవాటు చేసుకున్న రామకృష్ణకు పట్టణాల్లోని మానవ నిర్మితమైన కృత్రిమ వాతావరణంలోకూడా అందం లేకపోలే దనిపించింది.

రామకృష్ణ కవి కాకపోయినా అంతో ఇంతో రచనావ్యాసంగాన్ని అలవర్చుకున్నవాడు. చాలామంది రచయితల హృదయాలవలె అతనిహృదయంకూడా నవనీతం. ఏమాత్రం వేడి సోకినా కరిగే గుణంకలది. అంతేగాక రచయిత హృదయం—నే నేమీ పట్టించుకునే అవసరంలేదని కళ్లు మూసుకుని ముందుకు సాగలేదు. పరిసరాలను పరికిస్తుంది. అందాన్ని, ఆనందాన్నీ చూసి సంతోషిస్తూ సాగిపోతుంది. దైన్యాన్ని, దుఃఖాన్నీ చూచి జాలిని ప్రకటిస్తూ కుంటి నడకలు నడుస్తుంది.

రామకృష్ణ ప్రక్కనున్న కాల్వలలో ప్రతిబింబిస్తున్న విద్యుద్దీపాలను, ఆకాశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలిస్తున్న చంద్రుణ్ణి, అక్కడక్కడ మినుకు మినుకుమనే తారకల్ని చూస్తూ నడుస్తున్నాడే కాని, అతని హృదయం మాత్రం కాలువగట్టున నివసించే కొందరు దీనుల దురదృష్టాన్ని గురించి ఆలోచిస్తూనే వుంది.

వంతెన మీదనుంచి దూకుడుగా దిగివస్తున్న సైకిల్ రిక్షా మ్రోతతో వులిక్కిపడి ఈ లోకంలో పడ్డాడు రామకృష్ణ.

అతని చూపులు అక్కడే వున్న వొక దృశ్యంమీద

నిలిచినై. పది పదిహేనుమంది ప్రోగయి ఏదో వింతగా చూస్తున్నారు. రెండు ఆడ గొంతుకలు హృదయ విదారకంగా ఏడుపును ప్రసారం చేస్తున్నై. ఒక మగ వ్యక్తి చేయి చాచి అక్కడ చేరినవాళ్ళను, దారినపోయే వాళ్ళను ఏదో యాచిస్తున్నాడు. చూడటానికి దృఢంగానే వున్నాడతను.

'ఏదైనా పనిపాట చేసుకుని పొట్ట పోసుకోక యీ అడుక్కుతినటం ఎందుకో. ఛీ. ఛీ. దేశంలో సోమరితనం యింతగా ప్రబలిపోతోందేం. కాకపోతే ఏమిటది? అవిటివాళ్లూ అడుక్కు తినటమే; కాయకష్టం చేసుకోనేందుకు జవసత్వాలున్న ఇతనిలాంటివాళ్లూ అడుక్కోవటమేనా' అనుకున్నాడేగాని అక్కడికి వెళ్ళి అసలు సంగతి తెలుసుకోవాలనే కుతూహలాన్ని, అవసరమైతే సహాయం చేద్దామనే ఉదారతను అణుచుకోలేక పోయాడు రామకృష్ణ.

వంతెనకు దగ్గరగా కాలువ గట్టుపైన వొక వ్యక్తి పడుకుని వున్నాడు. అతనికి ఆపాదమస్తకం తెల్లటి గుడ్డ కప్పబడివుంది. ఆ వ్యక్తి చనిపోయివుంటాడని, అందుకే ఆడవాళ్ళిద్దరు విలపిస్తున్నారని తెలుసుకోవటానికి ఎంతోసేపు పట్టలేదు రామకృష్ణకు. అంతటితో సంతృప్తిపడక పక్కనున్న తోటి ప్రేక్షకులను వివరాలడిగాడు రామకృష్ణ. ఆ చనిపోయిన వ్యక్తి ఒక రిక్షావాలా అని, ఏడ్చే ఆ ఆడంగులలో ఒకరు తల్లి అని, మరొకరు భార్య అని లైటు స్తంభాని కానుకుని కూర్చున్న ఆరేళ్ళ పిల్లవాడు, అతని చేతిలో వున్న మరో పసికందు అతని పిల్లలనీ తెలిసింది.

సహజంగా ఈ రిక్షావాలాలకు మరో ఆధరవు వుండదు. ఎంత సంసారమైనా వాళ్ళ రెక్కల బలం మీద ఆధార పడవలసిందే. కాకపోతే ఆడవాళ్ళు రెండు మూడు కుటుంబాలకు పనిపాటలు చేసిపెడుతూనో, లేక బడి పిల్లలకు క్యారియర్లు మోసిపెట్టానో, తమ కొచ్చే ఆదాయాన్ని సంసారానికి వెచ్చిస్తూ వుంటారు — వేడి నీళ్ళకు చన్నీళ్ళుతోడుగా. కాని, యీ మరణించిన వ్యక్తి భార్య ఒక కాలులేని అవిటిది. తల్లి జరాభారంచేత జవసత్వాలుడిగిన అభాగిని. అలాంటి కుటుంబ పోషకుడు మరణిస్తే—

ఆ స్థితి ఎంత హృదయవిదారక మైనదో కళ్ళారా చూశాడు రామకృష్ణ. "ఆ కుటుంబానికి ముందుముందెలా గడుస్తుంది? ఆ పసికూనలు ఎలా బ్రతికి బట్ట కట్టారో కదా?" అని బాధగా మూలిగాడు రామకృష్ణ 'లోని' మనిషి.

"ఎట్టాగైనా ఈ కట్టె కడ తేర్చాలిగదా బాబూ... తోచింది ధర్మంచెయ్యండి బాబూ!" యాచిస్తున్న నడి వయస్కుడు డబ్బా నొకదాన్ని చేత పుచ్చుకుని గలగల లాడిస్తూ జనంచుట్టూ తిరుగుతున్నాడు. ఎవరికి తోచినదాన్ని వాళ్ళు డబ్బాలో పడేస్తున్నారు.

"చచ్చినవాణ్ణి తగలేయటానికి కూడా గతిలేస దరిద్రం" — ఎవరో అన్నారు ఏహ్యంగా.

"అంతేబాబూ. ఏం చేస్తాం చెప్పండి. రిక్షా యజమాని రిక్షాను షెడ్డులో పెట్టించుకుని నేనేం చేయలేను పొమ్మన్నాడు" బాధగా చెప్పాడు ఆ యాచించే వ్యక్తి.

ఆదుకొనే సత్తా వున్నా, ఆదుకుందామనే సద్బుద్ధి లేనివాళ్ళు కొందరైతే, ఆ సద్బుద్ధివున్నా శక్తిలేని వ్యక్తులు కొందరుంటారు. ఈ రెండవవర్గానికు చెందినవాళ్ళలో ఒకడైన తోటి రిక్షావాలా మిత్రుని శవాన్ని ఆ రోడ్డుపైనేవుంచి, ఆ శవదహనానికి కావలసిన ఖర్చులకు ధర్మబుద్ధి పరాయణుల్ని విత్తరూప సహాయానికి యాచిస్తున్నాడన్నమాట.

రామకృష్ణ గట్టిగా నిట్టూర్చాడు. ఇంత గట్టిగా నిట్టూర్చిన ఈ వ్యక్తి గొప్పగానే ధర్మం చేయవచ్చుననే ఆశతో గాబోలు ఆ యాచించే వ్యక్తి రామకృష్ణముందుకు వచ్చి డబ్బా గలగల లాడించాడు.

రామకృష్ణ హృదయం కలత చెందింది.

"ఇంతమంది వ్యక్తులు యీ దారిన వెళ్తూ ఒక్కరైనా అయ్యో పాపమని తగినంతగా ధర్మం చేయలేకపోయారే. అతిథి అభ్యాగతుల ఆదరణకు పేరుమోసిన భారతదేశంలో; శాంతి, సత్యా హింసల పునాదులతో బ్రహ్మాండమైన గౌరవ సౌధాలను నిర్మించుకుంటున్న భారత సమాజంలో; మనమంతా ఒక్కటి, బీదా - గొప్పా అనే భేదంలేదని చాటే వ్యక్తులెవ్వరూ యీ అభాగ్యుని అంతిమ యాత్రకు తగిన సౌకర్యాలను, సహాయాన్ని చేకూర్చలేక పోయారే" అని రామకృష్ణ అంతరాత్మ ఘోషించింది. ఇలాంటి నిర్భా

గ్యుల్ని ఆదుకోని సంఘపు నాగరికతాభివృద్ధిని మనసులోనే నిదించాడు, ఆవేశం వుప్పొంగిపోగా.

కాని, అతని చేయిమాత్రం జేబులోకి వెళ్ళలేదు ! అలాగని నిరాదరణతో అతను అక్కడినుండి కదలిపోనూ లేదు. అలాగే నిలబడి చూస్తూ వుండిపోయాడు. ఆ యాచించే వ్యక్తి యితని వాలకాన్ని చూచి అక్కడినుంచి తప్పుకున్నాడు.

ఒక అరగంట గడిచింది.

గుమిగూడిన వారిలో కొంతమంది జారుకున్నారు. ఆడంగుల గొంతులు మూగబోయినవి కాబోలు, అప్పుడప్పుడు మాత్రం ఎవరైనా దారిన వస్తూ పోతుంటే మూలుగుతున్నాయి. స్తంభానికి ఆనుకుని కూర్చున్న ఆరేళ్ళ కుర్రవాడి వొడిలోని పసికందు ఎప్పుడో నిద్ర పోయింది. ఆ కుర్రవాడుకూడా ఆకాశంవేపు చూస్తూ "చల్లనిరాజా వో చందమామ" అంటూ కూనిరాగం తీస్తున్నాడు.

రామకృష్ణకు నవ్వొచ్చింది, జాలీ వేసింది.

పాపం ! తమకు "నాన్న" అంటూ యిక లేడని, తమ భవిష్యత్తు బాధల మయమని తెలుసుకోలేని ఆ పసి హృదయాల అమాయకతకు జాలివేసింది. "చీకు - చింత, మంచి - చెడు, చావు - బ్రతుకు అంటే ఏమిటో అర్థం కాని వయస్సు వాళ్ళది" అనుకున్నాడు రామకృష్ణ.

ఏడుపు మానిన ఆ ఆడవాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారని గ్రహించిన రామకృష్ణ ఆలోచించటంమాని,

వారి మాటల్ని వినాలని ప్రయత్నించాడు. వినపడటమైతే వినపడింది గాని ఆ మాటలు అర్థంకాలే దతనికి. ఆ భాష వేరు. తనకు ఇంగ్లీషు, తెలుగు, అరవం, హిందీ తెలుసు గాని, వాళ్ళు మాటాడేది యీ నాలుగు భాషలో ఏ భాషా కాదు.

ఆ స్త్రీల మాటల్ని విన్న మగవ్యక్తి యాచించ టానికి మరెవ్వరూ కనుపించక ఆడంగులవద్ద జేరి డబ్బాలో వున్న చిల్లర డబ్బుల్ని తీసి వొక గుడ్డమీద పోసి లెక్క పెట్టడం మొదలెట్టాడు. "వచ్చిన డబ్బులు చాలు. ఇక జరగ వలసిన పని చూడు" అని వాళ్ళని వుంటారని వూహించాడు రామకృష్ణ.

డబ్బులు లెక్కించిన ఆ వ్యక్తి "ఐదు" అన్నాడు తెలుగులోనే. ఆరేళ్ళ కుర్రవాడు ఆత్రంగా వచ్చాడు చిల్లర పోసిన గుడ్డవద్దకు.

ఆ స్త్రీలు ఐదు అన్నమాట విని నిస్పృహ చెంది నట్లు ఆ గ్రుడ్డి వెలుగులో కనిపెట్టాడు రామకృష్ణ. "ఔను మరి. ఐదు రూపాయలు ఏ మూలకు?" అనుకున్నాడు తనలో తాను. "ఇంకెంత కావాలి?" — రామకృష్ణ ఆ వ్యక్తిని అడిగాడు.

ఇంతవరకూ అడిగినా 'ధర్మం' చేయకుండా యిప్పుడు ఇంకెంత కావాలని అడిగే యీ వింత వ్యక్తి—రామ కృష్ణ—ను ఎగాదిగా చూశాడా వ్యక్తి. కొన్ని క్షణాల వరకూ బదులు చెప్పలేక పోయాడు. చివరకు "మరో పదన్నా

లేకపోతే గడవదు సార్" అన్నాడు ఎంతో దీనంగా, వినయంగా చేతులు కట్టుకు నిలబడి.

రామకృష్ణ ప్యాంటు జేబులోంచి పర్సుతీసి పది రూపాయల నోటును ఆ వ్యక్తి కందించాడు. అయాచితంగా, ఆకస్మికంగా ఇంత డబ్బు ధర్మంగా దొరుకుతుందని అను కోని ఆ వ్యక్తి, స్త్రీ లిరువురూ గ్రుడ్లప్పగించారు ఆశ్చర్యంతో.

కొంతసేపటికి తేరుకొని యిక ప్రయాణ సన్నాహాలు చేయటం మొదలెట్టారు. పది నిముషాల్లో నాలుగు కర్రలు సంపాదించి వాటితో వొక వాహానం తయారుచేసి దానిపైన మరణించిన వ్యక్తిని పరుండబెట్టి మోసుకు పోవటానికి ఉద్యుక్తులైనారు.

ఇంతలో ఎవరో వ్యక్తులు వాళ్ళదగ్గర కొచ్చారు. జడదారుల్లా వున్నారు వాళ్ళిద్దరూ. వస్తూనే "అంతా సిద్ధం చేసివచ్చాం. ఇక పోదాం పదండి" అన్నారు ఆ యాచించే వ్యక్తితో. అతను "సరే" అంటూ లేచాడు. కాని, మర ణించిన వ్యక్తిని మోసుకు పోవటానికి వాళ్ళు ముగ్గురే అయి నారు. నాలుగో వ్యక్తి లేడు. అక్కడ రామకృష్ణ కాక నలుగు రైదుగురు వ్యక్తు లున్నారు. అంతా వింతగా చూస్తున్నారు. రామకృష్ణ ముందుకు వచ్చి "నాలుగో ప్రక్క నే నుంటాను రండి" అన్నాడు.

ఆ వ్యక్తులు, స్త్రీలు బిక్క మొహాలు వేశారు. ప్రేక్షకులు గుసగుసలాడారు.

"తప్పు బాబుగారూ, తమరు గొప్పోరు. మీా రిలా అనకూడదు. ఇప్పటికే చాలా ఋణపడ్డాం" మొదటి యాచకుడు యిలాంటి మాటలేవో అంటూ వుండగానే జడదారులిద్దరూ దగ్గరలోవున్న పాకపాకలోకి వెళ్ళి మరో వ్యక్తిని పిలుచుకొచ్చారు.

ఆడవాళ్ళిద్దరూ కడసారిగా ఏడుపు సాగించారు.

"మీారిక కొంపకు పదండి; మేమూ వస్తాం, పని పూర్తి చేసుకుని" అని ఆడవాళ్ళతో చెప్పి, ఆ నలుగురు వ్యక్తులు శవాన్ని తీసుకొని బయల్దేరారు.

శవాన్ని మోసుకుని కొంతదూరం సాగారు వాళ్ళు. అప్రయత్నంగా రామకృష్ణకాళ్ళు వాళ్ళు వెళ్ళినవేపే నడిచినై. అతనితో మరో నలుగురు కూడా వందగజాలు నడిచి వాళ్ళని సాగనంపి ఒక్క రొక్కరుగా జారుకున్నారు.

జంపని కాలువ వంతెన దగ్గర పడింది. రామకృష్ణ వాళ్ళ వెనుకగా నడుస్తున్నాడు. అతని మనస్సులో అనేక భావాలు ఇట్టే మొలచి మాయమవుతున్నై.

'పుట్టటం - గిట్టటం రెండూ ఒకే దారపు రెండు కొనలు. ఆ దారపు పొడవు ఎంతో ఎవరికీ తెలియదు. ఎక్కడైనా అంతం కావచ్చు, లేక ఎప్పుడైనా పుటుక్కు మన వచ్చు. అందుకని పుట్టుకను, గిట్టుటను ఒకే చిత్త ప్రవృత్తితో చూడగలిగిన వాడే నిజమైన వేదాంతి. శిశువు జీవితంలో ఎన్నో కష్టాల్ని ఎదుర్కొనాలనే సత్యాన్ని విస్మరించి, శిశువు పుట్టగానే వుప్పొంగిపోయి, భవబంధాలను త్రెంచుకుని, మరణ మనే పేరుతో ఇహలోక విముక్తుడౌతున్న

అదృష్ట జీవిని చూచి ఏడవటం సామాన్య మానవలక్షణం-అంటారు విజ్ఞులు.'

శవాన్ని దింపి తన రాకను ఆశ్చర్యంతో చూస్తున్న ఆ నలుగురి వ్యక్తుల్ని చూచి రామకృష్ణ తన ఆలోచనలకు స్వస్తి చెప్పాడు.

"ఎందుకు ఆగారు?" అని ప్రశ్నించాడు.

కొద్ది నిముషాలు జవాబుకై తడుముకొని "దింపుడు కళ్ళాంఆశ బాబూ" అన్నాడు ఒక జడదారి.

'అవును మరి. మనిషి మరణించినా ఆశ చావదు. మరికొన్ని క్షణాలలో బూడిదగానో, మట్టిగానో మారిపో బోతున్న మృత శరీరం సజీవమై లేచివస్తుందనే ఆశ! ఈ ఆశ మానవుడిని ఎంతటి పిచ్చివాణ్ణిగా చేస్తున్నది' అనుకున్నాడు రామకృష్ణ.

రామకృష్ణ కిప్పుడు స్మశాన వేదాంతం బాగా తల కెక్కింది.

ఆ నలుగురూ మళ్ళీ తమ పనిని కొనసాగించబోతూ అన్నారు. "బాబూ - తమరిక వుండండి. ముందంతా గుట్టలు, తుప్పలూ, ముళ్ళూ. పురుగు, పుట్రా వుంటాయి. చీకటి గాఢాంధకారం పైగా."

రామకృష్ణ ఒకసారి ముందుకు చూచి 'నిజమే' అనుకుని ఆగిపోయాడు. వారు నలుగురూ శవాన్ని మోసుకుంటూ సాగిపోయారు వంతెన దాటి.

వెనుదిరగ బోతున్న రామకృష్ణకు మళ్ళీ ఏదో అనుమానం కలిగింది. "పాపం. వీళ్ళు నలుగురే వెళ్ళుతున్నారు.

మరొకరి సహాయం ఏమైనా కావలసి వస్తుందేమో. ఈ గుట్టల్లోను, తుప్పల్లోను, పురుగూ పుట్రా వున్నా కొంచెం వోర్చుకుంటే వారికి అవసరమైతే సహాయం చేయవచ్చు. చచ్చి స్వర్గానికి వెళ్తున్న ఆ జీవి ఎంతో శాంతి పొందుతాడు"

ఈ ఆలోచనే రామకృష్ణను ముందు సాగిపోయే వాళ్ళకి కనపడకుండా వారి ననుసరించేలా చేసింది. 'వాగు చూస్తే తను కష్టపడటం సహించలేక వాళ్ళు తనను వెనక్కు వెళ్ళిపొమ్మనవచ్చు, అప్పుడు తను సందిగ్ధావస్థలో పడాలి' అనే సందేహమే కాక, ఆ మృత శరీరాన్ని దహనం చేస్తారో, భూస్థాపితం చేస్తారో కూడా చూచి పోదామనే కుతూహలం కలిగిందతనికి.

రామకృష్ణకు, ముందుకు సాగిపోయిన వారికి అర ఫర్లాంగుదూర మేర్పడింది. కదులుతున్న ఆకారాలుగా మాత్రమే ఆ వ్యక్తులు గోచరిస్తున్నా రతనికి.

చుట్టు ప్రక్కల కీచురాళ్ళ సంగీత స్వరాలు. వుండి ఉండి ఏదో పిట్ట ఏడుస్తున్నట్టు అరుస్తున్నది.

కొంతదూరం వెళ్ళిన తర్వాత ఆ నలుగురూ తాము మోస్తున్న శవాన్ని దింపారు. రామకృష్ణ ఒక చెట్టును చాటు చేసికొని చూస్తున్నాడు. వాళ్ళేం చేస్తున్నదీ సరిగా కనుపించక పోవటంతో మరికొంచెం ముందుకు వెళ్దామని కదల బోతుండగా, వాళ్లు తనవేపే నడిచి రావటం గమనించాడు రామకృష్ణ.

కాని— — కాని— —!

రామకృష్ణ గట్టిగా కళ్లు నులుముకుని మళ్ళీ చూశాడు. సందేహం లేదు.

ఆ వచ్చే వ్యక్తులు ఐదుగురు !—

నడిచి తనవైపే వస్తున్నారు. రామకృష్ణ గిచ్చి చూసుకున్నాడు అది కలేమోనని. నొప్పి పుట్టింది.

'తమలోని ఒక వ్యక్తిని చనిపోయినట్లుగా నటింప జేసి డబ్బుకోసం ఆడిన నాటక మన్నమాట!

"ఇంపోస్టర్స్, బ్రూట్స్" కసిగా గొణుక్కున్నాడు రామకృష్ణ.

దగ్గరగా వచ్చారు వాళ్ళు. వారిని నిలవేసి "ఏమిటీ నాటకం ?" అని ఏదో అడగబోయాడు రామకృష్ణ. కాని అంతలోనే ఒకవ్యక్తి కెవ్వుమని కేకవేసి అల్లంత దూరాన ఎగిరి పడ్డాడు. మిగతా నలుగురూ అదిరిపడి, బిత్తరపోయి తమ భాషలో ఏదో అంటూ క్రింద పడిన వ్యక్తి చుట్టూ చేరారు.

పూర్వపు యాచకుడు అగ్గిపుల్ల వెలిగించాడు. ఆ వెలుగులో రామకృష్ణ చుట్టూచేరిన ఆ నలుగుర్ని గుర్తు పట్టాడు. వాళ్ళు శవ వాహకులు. క్రింద పడిన వ్యక్తి మర ణించినట్లు నటించిన వ్యక్తి అయివుండాలి.

ఆ వ్యక్తులకూ తనకూ మధ్యగా ఏదో జరజరా ప్రాకి నట్లు ముందుకు చూశాడు రామకృష్ణ. ఆ నలుగురు వ్యక్తులూ ఒక్కసారిగా "అమ్మో పాము" అంటూ ప్రక్కకు తొల గారు గాభరాగా.

మరో అగ్గిపుల్ల గీచారు ఎవరో. ఆ గ్రుడ్డి వెలుగులో తమ ముందు నిలబడివున్న రామకృష్ణను చూచి ఆ నలుగురూ నిలువునా నీరు కారిపోయారు.

మర్నాడు—

ఉదయం ఏడుగంటలకు బస్సుకోసం ఆదరాబాదరా పరుగెత్తుతున్న రామకృష్ణ కొత్త వంతెన క్రిందుగా, కాలువ ప్రక్కగా శవాన్ని పరుండబెట్టి దారిన వచ్చేపోయే వాళ్ళని యాచిస్తున్న వ్యక్తినీ, హృదయ విదారకంగా విలపిస్తున్న ఇద్దరు స్త్రీలను చూశాడు. అదే ప్రదేశంలో రాత్రి చూచిన దృశ్యానికి, యిప్పుడు కన్పించే దృశ్యానికీ తేడా లేదని ఎవరైనా అంటే అనవచ్చు. కాని, ఎంతో తేడా వుందని రామకృష్ణ అంతరాత్మ హెచ్చరిస్తున్నది.

ఇప్పుడా ఆ రేళ్ళ కుర్రవాడు, పసికూనకూడా ఏడ్వడంలో ప్రస్ఫుటిస్తోంది-రామకృష్ణ కొక్కడికే తెలిసిన తేడా!